


పరిమితి మించితే చిక్కులే

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈసీ నిబంధనలకు లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుంది. పరిమితికి మించి వ్యయం దాటితే చిక్కులు తప్పవు. 8లో ▸



తనిఖీల్లో నగదు సీజ్

జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయి. పరిమితికి మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేశారు. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
ఏలూరు	6.26	4.34
భీమవరం	6.24	4.36

మండుటెండలో పింఛన్ వెతలు

- టీడీపీ కుట్రతో మళ్లీ పాత కష్టాలు
- ఉదయం నుంచే సచివాలయాల్లో లబ్ధిదారుల పడిగాపులు
- ఎండకు తాళలేక వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు
- ఏలూరు జిల్లాలో 48 శాతం పెన్షన్ పంపిణీ
- నేడు, రేపు కూడా కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



ఏలూరు చొదిదిబ్బలో పింఛన్ కోసం కిక్కిరిసిపోయిన సచివాలయం




ఏలూరులో పెన్షన్ కోసం సచివాలయాలకు వెళ్తున్న వృద్ధులు, దివ్యాంగులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీడీపీ పచ్చ బ్యాచ్ కుట్రలతో పింఛన్లు అందుకోడానికి జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు తొలిరోజు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ చంద్రబాబు పాలన నాటి రోజులు వచ్చాయంటూ లబ్ధిదారులు వాపోయారు. వలంటీర్లను పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకోవడంతో రెండు రోజులు ఆలస్యంగా పింఛన్ల పంపిణీ మొదలైంది. బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం సాయం అందించడం ప్రారంభించారు. మండుటెండలో సచివాలయాలకు వెళ్లి ప్రభుత్వ సాయం తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా గత ఐదేళ్లుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్ సాయం అందిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వలంటీర్ల సేవలకు వణికిన ప్రతిపక్ష నేత చంద్రబాబు తన అనుకూల వర్గం ద్వారా ఈసీకి ఫిర్యాదులు చేయించి పంపిణీ అడ్డుకున్నారు. బుధవారం రాత్రి 8 గంటల వరకూ 48.07 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సచివాలయాల్లో ఏర్పాట్లు : ఏలూరు జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,70,804 మంది పెన్షన్‌దారులకు రూ.81.50 కోట్ల మేర చెల్లించాలి. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ ప్రారంభించారు. బుధవారం నుంచి పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సచివాలయాల్లో సిబ్బంది పంపిణీ మొదలుపెట్టారు. వందలాది మంది లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులు తీరారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, దెందులూరు, భీమడోలు, బుట్టాయగూడెం ఇలా అన్ని మండలాల్లో బుధవారం ఉదయం నుంచే పింఛన్ పంపిణీ హడావుడి మొదలైంది. రాత్రి 7 గంటల వరకు 48.07 శాతం పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. బుధవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సచివాలయాల వద్ద ప్రత్యేక టెంట్లు, కొన్నిచోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. గురు, శుక్రవారాల్లో కూడా పంపిణీ కొనసాగనుంది.

1.30 లక్షల పెన్షన్లు పంపిణీ : జిల్లాలో 2,70,804 పెన్షన్లకు మొదటి రోజు 1,30,176 పెన్షన్లు అందచేశారు. అత్యధికంగా జంగారెడ్డిగూడెంలో 69.90 శాతం, ఏలూరు అర్బన్‌లో 68.86 శాతం, నూజివీడు అర్బన్‌లో 68.75 శాతం, పెదపాడులో 68.29 శాతం, దెందులూరులో 64.64 శాతం అందచేశారు. కలిదిండి, కుక్కునూరు మండలాల్లో మాత్రం 15 శాతం లోపే పంపిణీ జరిగింది.

రోజంతా పడిగాపులు



అడవికొలను -2 సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు పడ్డాం. గ్రామంలో 50 మంది వరకూ ఇలాగే ఎదురుచూశారు. చంద్రబాబు రోజులు గుర్తొచ్చాయి. అప్పుడు ఇచ్చే అరకొర పింఛన్ కోసం పంచాయతీల వద్ద పడిగాపులు పడేవాళ్లం. చంద్రబాబు చేసిన కుట్ర కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది.

– గుని‌శెట్టి రంగారావు, ఎనికేపల్లి , నిడమర్రు మండలం

ఆస్పత్రికి తెచ్చి ఇచ్చేవారు



వలంటీర్లు ఇంటికి తీసుకు వచ్చి పింఛను ఇస్తున్నారు. ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు వల్ల ఎండలో సచివాలయం వెతుక్కుంటూ రావాల్సివచ్చింది. వలంటీర్లంటే ఎందుకంత భయమో అర్థం కావడం లేదు. చంద్రబాబు ఏనాడు పింఛన్ల ఇంటికి పంపించలేదు. తెచ్చి ఇస్తున్న వారిని చెడగొట్టాడు.

– కొండా నాగేశ్వరరావు, ఎన్టీఆర్ కాలనీ, నూజివీడు

మా ఉసురు చంద్రబాబుకు తప్పదు



పింఛన్ సొమ్ముల కోసం నాలుగు సార్లు సచివాలయం వద్దకు వెళ్లాను. వలంటీర్ల ద్వారా జగన్ ఒకటో తేదీ వేకువ జామునే చేతికి రూ.3 వేలు అందించేవాడు. ఎవ్వరిని అడుక్కోకుండా తలఎత్తుకు జీవించే వాళ్లం. వలంటీర్ల ద్వారా పంపిణీ చంద్రబాబు అడ్డుకోవడం దారుణం. మా ఉసురు అడ్డుకున్నవాళ్లకు తప్పక తగులుతుంది.

– బేతపూడి సౌదామని, ఎనికేపల్లి, నిడమర్రు మండలం

చంద్రబాబుకు కడుపుమంట ఎందుకు?



చంద్రబాబుకు కడుపుమంట ఎందుకో అర్థం కావడం లేదు. ఈ నాలుగేళ్లలో సచివాలయం ఎక్కడ ఉందో కూడా నాకు తెలియదు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా మొదటి తారీఖున ఇంటికే డబ్బు పంపించేవారు. ఇప్పుడు ఎండలో పడి కుంటుకుంటూ వచ్చి పింఛన్ తీసుకున్నా. వలంటీర్లు వచ్చి డబ్బులు ఇచ్చి వెళ్లిపోతారు తప్ప వారేమీ చేయరు కదా.

– పులిపాక వీర వెంకటేశ్వరరావు, 15వ వార్డు, నూజివీడు

న్యూస్‌రీల్

పారదర్శకంగా సంక్షేమ పథకాల పంపిణీ



పింఛన్ సొమ్ము కోసం వాసుబాబుకు మొరపెట్టుకుంటున్న వృద్ధుడు

గణపవరం: సంక్షేమ పథకాలను సకాలంలో పారదర్శకంగా ప్రజలకు అందించిన వైఎస్ జగన్‌కు, వాటిని ఎలా ఎగ్గొట్టాలో అని ఆలోచించే చంద్రబాబుకు తేడా గమనించి విజ్ఞతతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం రాత్రి గణపవరం మండలం చినరామచంద్రపురంలో ఇందిరమ్మ కాలనీలో ఆయన మన ఇంటికి మన వాసన్న కార్యక్రమంలో భాగంగా ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని అన్నారు. సంక్షేమ పథకాలను సిఫార్సులు, లంచాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని. అలాంటి పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్న కోరిక ప్రజలందరిలో కనిపిస్తోందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, మండల కన్వీనర్ దండు రాము, నాయకులు కాళర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, మాదేటి సురేష్, రొంగల శ్రీను, తెనాలి సునీల్, అడపా త్రినాథ్, కొండేటి వెంకటరత్నం, మారిశెట్టి అబ్బులు, కాపునాడు అధ్యక్షుడు నంబు కొండలరావునాయుడు, సర్పంచ్ మూర అలంకారం, వైఎస్ ఎంపీపీ సలాది రత్నకుమారి, ఎంపీటీసీ బత్తి సీతామహాలక్ష్మి, దండు రవి, నన్నేటి మోహన్ పాల్గొన్నారు.

పెన్షనర్ల కోసం కనీస వసతులు



పాలగూడెంలో వృద్ధులతో మాట్లాడుతున్న డీపీఓ తూతిక విశ్వనాథ్

ఏలూరు రూరల్ : పింఛన్ పంపిణీ సమయంలో వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పాలగూడెం సచివాలయం వద్ద పంపిణీ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల వద్దకు వస్తున్న పింఛన్‌దారులకు తాగునీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. టెంట్లు, కుర్చీలు వేయిస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఈఓపీఆర్డీ ఎం.సరళకుమారి చాటపర్రు తదితర గ్రామాల్లో సచివాలయాల వద్ద వసతులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

కలపర్రు చెక్‌పోస్టు తనిఖీ



కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ డీ మేరీ ప్రశాంతి

పెదపాడు: కలపర్రులో టోల్‌గేట్ వద్ద చెక్‌పోస్టును ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వాహనాల తనిఖీ విధానాన్ని పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలన్నారు. వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. తనిఖీల పేరుతో వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశాం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని జెడ్పీ సీఈవో కె.సుబ్బారావు తెలిపారు. బ్యాంకుల నుంచి నగదు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం పెదపాడు ఎస్‌బీఐ బ్యాంక్‌ను ఆయన సందర్శించి పెన్షన్ నగదు పంపిణీని పరిశీలించారు. సచివాలయాల వద్ద షామియానాలు, తాగునీరు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు





ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బ్రాహ్మణ సంఘాల మహిళలు, వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నాయకులు



జంగారెడ్డిగూడెంలో జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మేలు జరగాలంటే... నగరం అభివృద్ధి పథంలో నడవాలంటే మరోసారి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని విజయం సాధించాల్సిందేనని బ్రాహ్మణ సంఘాల నేతలు తెలిపారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో నగరంలోని పలు బ్రాహ్మణ సంఘాల నేతలు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కో‌ఆప్షన్ సభ్యులు కొంపెల్ల తాయారు, ఆర్‌ఆర్‌పేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు టీఆర్ శర్మ, శృంగారం శ్రీరామచంద్రమూర్తి, మద్దాల నాగరాజు, ఎస్ఎస్ చక్రధర్, భానుమూర్తి, నండూరి వేణుగోపాల్, ఎస్.నాగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో సుమారు 300 మంది బ్రాహ్మణ సంఘాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ .. ఏలూరు నగరంలో ప్రతీ వర్గానికి మంచి చేసేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి ఉన్నత కులాలకు చెందిన పేదవారికి సైతం సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు.

బీజేపీ నుంచి 50 మంది చేరిక

ఏలూరు 23వ డివిజన్ కార్పొరేటర్ కలవకొల్లు సాంబ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గండికోట చినరంగారావు, ఇడ్నా వెంకటరావు, రెడ్డి లక్ష్మయ్య, బూరడ వెంకన్న, లంక గౌరీ, సుంకర ఆదినారాయణ ఆధ్వర్యంలో 50మంది బీజేపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, క్లస్టర్-8 పార్టీ అధ్యక్షులు మంచెం మైబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీలో చేరికల పర్వం కొనసాగుతోంది. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పార్టీ పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో జనసేన నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంభం విజయరాజు, సీనియర్ నాయకులు జెట్టి గురునాధరావు తదితరులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, 6వ వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్ ఆధ్వర్యంలో యడ్లపల్లి అవినాష్, ముప్పిడి గుణశేఖర్, మద్దిపాటి దిలీప్, కలపాల వెంకటేష్, ముప్పిడి చింటూ, పాల అమ్ము, వసంతాటి ముఖేష్, యడ్లపల్లి రాకేష్, ముప్పిడి వీరభద్రరావు, మెరిపే అఖి, అన్నం లోకేష్, నాగిలంక కార్తీక్ తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వైస్ చైర్మన్ కంచర్ల వాసవీరత్నం, టీవీఆర్ చౌదరి, మండవల్లి సోంబాబు, మేడవరపు విద్యాసాగర్ పాల్గొన్నారు.

టీడీపీ ఆఫీసుకు కోడ్ వర్తించదా?



నూజివీడులోని టీడీపీ కార్యాలయం ప్రహరీకి రోడ్డు వైపు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ

నూజివీడు: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు తమ బాధ్యతను విస్మరించడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు పట్టణం విజయవాడ రోడ్డులోని టీడీపీ కార్యాలయానికి చెందిన ప్రహరీకి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఎన్నికల నిబంధనల ప్రకారం పార్టీ జెండాను, చిన్న సైజులో ఒక ఫ్లెక్సీని మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉండగా, ప్రహరీ పొడవునా ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా సంబంధిత అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయమైన ద్వారకా ఎస్టేట్ ప్రహరీకి ఎప్పటి నుంచో ఉన్న ఫ్లెక్సీని తొలగించడంలో ఉత్సాహం చూపిన అధికారులకు ఇది ఎందుకు కనిపించలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగానికి భరోసా.. పాలిటెక్నిక్

- పాలిటెక్నిక్ అర్హతతో పలు ఉద్యోగావకాశాలు
- ఈ నెల 27న పాలిసెట్ పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 4 ప్రభుత్వ, 13 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు



పాలిటెక్నిక్ విద్యార్థులు



నగరంలోని సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి తరువాత ఏం చదవాలి.. వీలైనంత తొందరగా ఉద్యోగం సంపాదించాలనుకేవారికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. సాధారణంగా పదో తరగతి పూర్తయిన తరువాత ఇంటర్, అనంతరం బీ.టెక్, డిగ్రీ కోర్సులు చేయడం సాధారణం. అయితే డిగ్రీ పూర్తయ్యి ఉద్యోగం వచ్చేంత సమయం లేకపోవడంతో చాలామంది పాలిటెక్నిక్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు.

'పది' వెంటనే సాంకేతిక విద్యలో ప్రవేశాలు

పదో తరగతి చదివిన వెంటనే సాంకేతిక విద్య చదవాలనుకునే వారికి పాలిటెక్నిక్ కోర్సు గొప్ప అవకాశం. పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు చేసినా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. ఇటీవలి వివిధ సంస్థలు నేరుగా కళాశాలలకు వెళ్ళి పాలిటెక్నిక్ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులను తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆయా కళాశాలల్లో జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధిస్తే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీటు లభించి తక్కువ ఖర్చుతో కోర్సు పూర్తి చేసే వెసులుబాటు ఉంటుంది.

ఈ నెల 5తో పాలిసెట్‌కు తుది గడువు

ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ పరీక్ష రాయాల్సిందే. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 5 వరకూ గడువు ఉంది. పరీక్ష ఈ నెల 27న ఎంపిక చేసిన కేంద్రాల్లో నిర్వహిస్తారు. ఫలితాలను మే నెల 25న విడుదల చేస్తారు. జూన్ నాలుగో వారం నుంచి ప్రవేశాలకు కౌన్సిలింగ్ ప్రారంభిస్తారు. పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. గణితం 50 మార్కులు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగానే పరీక్ష నిర్వహించడంతో విద్యార్థులకు పెద్దగా ఒత్తిడి ఉండదు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 400 చొప్పున పరీక్ష ఫీజుగా చెల్లించాలి. ఆన్‌లైన్‌లో పాలిసెట్ ఏపీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. పరీక్ష అర్హతకు ప్రామాణికంగా 35 మార్కులు నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లాలో 5,655 సీట్లు : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు సంబంధించి 17 కళాశాలలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 3 ప్రభుత్వ, 5 ప్రైవేట్ కళాశాలలు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక ప్రభుత్వ, 8 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో వివిధ కోర్సులకు సంబంధించి మొత్తం 5,655 సీట్లు ఉన్నాయి. పాలిటెక్నిక్‌లో ప్రధానంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ కమ్యూనికేషన్ అండ్ నెట్‌వర్క్స్, క్లౌడ్ కంప్యూటింగ్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ వంటి అత్యాధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు



తక్కువ ఫీజులతో ప్రాథమిక స్థాయిలోనే సాంకేతిక విద్య లభించే కోర్సు పాలిటెక్నిక్. విద్యార్థుల భావి జీవితానికి బంగారు బాటలు వేసుకునే అవకాశం ఈ కోర్సు ద్వారా లభిస్తుంది. సకాలంలో కోర్సు పూర్తి చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా లభిస్తాయి. కళాశాలల్లో నిర్వహించే జాబ్ మేళాలు, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పెద్ద పెద్ద సంస్థలు నైపుణ్యం ఉన్నవారిని ఎంపిక చేసుకుని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, మెటీరియల్ అందిస్తున్నారు.

– అక్కినేని శివకుమార్, ప్రిన్సిపాల్, సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కళాశాల

క్లుప్తంగా

శ్రీవారి సేవలో విదేశీ భక్తుడు



స్వామివారి వాహనాన్ని మోస్తున్న విదేశీ భక్తుడు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఒక విదేశీ భక్తుడు బుధవారం సందర్శించాడు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి తొళక్క వాహనంపై నిత్య కల్యాణ మండపం వద్దకు తరలివెళుతున్న స్వామి, అమ్మవార్ల వాహనాన్ని భక్తి ప్రపత్తులతో మోశాడు. ఆ విదేశీ భక్తుడి భక్తిని చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఆ విదేశీ భక్తుడు తన వివరాలను తెలిపేందుకు ఇష్టపడలేదు.

పోక్సో కేసు నమోదు

టి.నరసాపురం: బాలికకు మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకువెళ్లిన నేరంపై ఒక యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఉన్నాయి. మండలంలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఓ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ఎం.సోమరాజు ప్రేమిస్తున్నానని వెంటబడేవాడన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికకు మాయ మాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకువెళ్లిపోయాడన్నారు. బుధవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి

భీమడోలు: గోదావరి కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోలసానిపల్లికి చెందిన దౌలూరి శ్రీను (48) భీమడోలులో గ్యాస్ వెల్డింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం జాతీయ రహదారి భీమడోలు శివాలయం వద్ద గల గోదావరి కాలువలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడి కాల్వలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న గుర్రపు డెక్కలో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని కాల్వలోంచి బయటకు తీశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఖర్చుపై లెక్క లేకపోతే చిక్కులే

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఈసీ నిఘా
- ప్రత్యేక బృందాలతో పక్కాగా లెక్కింపు
- నామినేషన్ వేసిన రోజు నుంచి మొదలు
- అప్పటివరకు పార్టీ ఖాతాకే ఖర్చు జమ

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెడతామంటే కుదరదు. దానికి ఓ లెక్కుంది. అభ్యర్థులు చేసే వ్యయాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రత్యేక బృందాలు డేగ కళ్లతో గమనిస్తూనే ఉంటాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు ఎలక్షన్ కమిషన్ వెసులుబాటు ఇచ్చింది. ఈ పరిమితికి లోబడి అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పరిమితికి మించి ఎన్నికల వ్యయం దాటితే అభ్యర్థులకు చిక్కులు తప్పవు.



సాక్షి, భీమవరం : సార్వత్రిక పోరులో నిలిచే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ముమ్మరంగా ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో ప్రతీది ఖర్చుతో కూడుకున్న పని కావడంతో అధికార యంత్రాంగం ఎన్నికల వ్యయాన్ని లెక్కించే పనిలో నిమగ్నమైంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు చేసే ఖర్చును పార్టీ ఖర్చుగా పరిగణిస్తారు. నామినేషన్ వేసిన రోజు నుంచి చేసే ప్రతి ఖర్చు వారి వ్యయ పరిమితిలోకి వస్తుంది. ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేసుకోవచ్చు. ఈసీ నిర్ణయించిన ఈ పరిమితి మేరకు నామినేషన్‌కు ముందు రోజునే అభ్యర్థి జాతీయ బ్యాంకులో కొత్త అకౌంట్ ఓపెన్ చేసి ఆ మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. నామినేషన్ తర్వాతి నుంచి ర్యాలీలు, సమావేశాలు, భోజనాలు, వాహనాలు, సౌండ్ సిస్టమ్, తదితర ఎన్నికల నిమిత్తం చేసే ఖర్చులన్నింటిని అభ్యర్థి అకౌంట్ నుంచి మాత్రమే చెల్లించాలి. వాటికి సంబంధించి బిల్లులు తప్పనిసరిగా భద్రపర్చుకోవాలి.

ప్రత్యేక బృందాల నిఘా

ఎన్నికల నిమిత్తం జిల్లాలో 137 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో 19 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు (ఎఫ్ఎస్‌టీ), 28 స్టాటిక్ సర్వైలెన్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), 24 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్స్ (ఎంసీసీ), 59 వీడియో సర్వైలెన్ టీమ్స్ (వీఎస్‌టీ), ఏడు వీడియో వ్యూయింగ్ టీం (వీవీటీ)లు ఉన్నాయి. ఈ బృందాలు ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు జరిగేలా కృషి చేస్తాయి. అభ్యర్థులు చేసే వ్యయంపై వారికి తెలియకుండా నిఘా ఉంచుతాయి. ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ నిర్వహించినప్పుడు వీఎస్‌టీ వీడియో తీసి ఎన్ని ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లు ఎన్ని ఉన్నాయి, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లుతో పాటు జెండాలు, కండువాలు, పోస్టర్లు, కరపత్రాలు తదితర ఎన్నికల సామగ్రి ఉన్నాయి. భోజనాల ఖర్చు ఎంత? తదితర అంశాలను పరిశీలించి జిల్లా కమిటీ విడుదల చేసిన స్టాండర్డ్ రేట్స్ చార్ట్ ప్రకారం ఖర్చును లెక్కిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌కు చేసే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి తీసుకుంటారు.

మూడుసార్లు పరిశీలన

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కో అసిస్టెంట్ ఎలక్షన్ వ్యయ పరిశీలకులు, వారి కింద అకౌంటింగ్ టీంలు ఉంటాయి. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీలకు గాను మొత్తం ఎనిమిది మంది అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించారు. వీరు ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహిస్తారు. నామినేషన్ నుంచి ఎన్నికలు ముగిసే లోగా మూడుసార్లు తమ వద్ద ఉన్న వివరాలతో అభ్యర్థులు చూపిన వ్యయం వివరాలతో సరిపోల్చి చూస్తారు. అభ్యర్థులు వ్యయం తక్కువ చూపిస్తే తమ వద్ద ఉన్న ఆధారాలను వారికి చూపించి సరిచేయిస్తారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన నాటి నుంచి నెలరోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తి ఖర్చుల తాలుకు వివరాలు, వాటి బిల్లులను అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. పరిమితికి మించి ఖర్చు చేసినా, బిల్లులు సక్రమంగా చూపించపోతే వారికి చిక్కులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

12 సార్లు పెరిగిన ఎన్నికల వ్యయం

1952 నుంచి ఇప్పటివరకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈసీ 12 సార్లు ఎన్నికల వ్యయాన్ని పెంచుకుంటూ వచ్చింది. తొలి ఎన్నికల్లో వ్యయ పరిమితి రూ.లక్ష కాగా, 1957లో రూ.రెండు లక్షలు, 1962లో రూ.మూడు లక్షలు, 1971లో రూ.నాలుగు లక్షలు, 1975లో రూ.ఐదు లక్షలుగా ఉంది. 1984 ఎన్నికల్లో ఈ వ్యయం రెట్టింపై రూ.10 లక్షలకు చేరింది. 1991లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009 ఎన్నికల్లో రూ.29 లక్షలకు చేరింది. 2014 ఎన్నికల్లో రూ.28 లక్షలు, 2019 ఎన్నికల్లో రూ.30 లక్షలుగా ఉన్న వ్యయ పరిమితిని ప్రస్తుత ఎన్నికలకు రూ.40 లక్షలకు పెంచింది. తొలి ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత వ్యయ పరిమితి 40 రెట్లు పెరిగింది.

కార్యకలాపాలన్నీ క్షుణ్ణంగా పరిశీలన



రాజకీయ పార్టీలకు సంబంధించి ప్రకటనలు, సమావేశాలు, ర్యాలీలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. అభ్యర్థులు ఈసీ మార్గదర్శకాలు మేరకు పరిమితికి లోబడి ఖర్చు చేయాలి. నోటిఫికేషన్ వచ్చే వరకు అభ్యర్థులు చేసే ఖర్చులను సంబంధిత పార్టీల ఖాతాలకు, అనంతరం వారి ఖాతాలకు జమచేయడం జరుగుతుంది.

– కె.సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

మద్దతు ధరకే ధాన్యం కొంటాం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ వెంకటేశ్వరరావు

గణపవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు, గోనె సంచులు సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం రైతు భరోసా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని, మండలంలో ఏర్పాటు చేసిన 16 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈనెల 5వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాలన్నింటిలో అవసరమైన గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలులో ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. మద్దతు ధర కన్నా బయటి మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తే రైతులు బయట ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించామన్నారు. మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు సిబ్బందికి పీపీసీ, ఏపీపీల వినియోగం, రిజిస్టర్ల నిర్వహణ, గోనె సంచుల రసీదులు, ధాన్యం తేమశాతం పరీక్ష తదితర విషయాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంబాబు, ఎంఎల్ఓ దాసు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన వలంటీర్ల రాజీనామాలు



భీమవరంలో మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలో పలు వార్డుల నుంచి దాదాపు 200 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. భీమవరం మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీవిద్యకు వార్డుల వారీగా వలంటీర్లు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం పలువురు వలంటీర్లు మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తమకు ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. ఏ రోజు కూడా తాము రాజకీయాల గురించి తమకు కేటాయించిన 50 కుటుంబాలకు చెప్పలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంలో చిత్తశుద్ధితో పనిచేశామన్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అందించడంతోపాటు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అవసరమైన పత్రాలను అందించడం కోసం మాత్రమే పనిచేశామన్నారు. కరోనా విపత్తులో కూడా ప్రజలకు సేవ చేయాలని ధైర్యంగా బయటకు వచ్చి తమ వంతు సేవలు అందించామన్నారు. గత నాలుగున్నరేళ్లుగా తాము చేసిన సేవలు ప్రతిపక్షాలకు తెలిసినా నేడు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలను చేస్తూ మమ్మల్ని ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా పెన్షన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందించే తమను ఈ నెల పెన్షన్ డబ్బులు రాలేదేంటని పలువురు అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి వచ్చిందన్నారు. వృద్ధులు పెన్షన్ కోసం సచివాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడుతుంటే చాలా బాధగా ఉందన్నారు. వృద్ధులతో సంక్షేమ పథకాలు అందుకునే పేదవారితో రాజకీయాలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్ వ్యవస్థపై రాజకీయ కుట్రలు చేయడం సమంజసం కాదన్నారు.

పోలవరం సీటు టీడీపీకే కేటాయించాలి



పోలవరం టీడీపీ నేతలను బుజ్జగిస్తున్న ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్

భీమడోలు: పోలవరం ఎమ్మెల్యే టికెట్‌ను తెలుగుదేశం పార్టీకి చెందిన బొరగం శ్రీనివాస్‌కు కేటాయించాలని, లేనిపక్షంలో గెలుపు కష్టమని ఆ పార్టీ నియోజకవర్గ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి బుధవారం భీమడోలులో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌లను కలిసి పట్టుపట్టారు. ఈ స్థానాన్ని ఇతర అభ్యర్థులకు కేటాయిస్తే ఓడిపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. పొత్తు ధర్మంలో గెలిచే సీట్లను టీడీపీకి కాకుండా ఇతర పార్టీలకు కేటాయించడం వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతుందని వాపోయారు. దీనిపై గన్ని వీరాంజనేయులు వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం నల్లజర్లలో జరిగే ప్రజాగళం సభకు చంద్రబాబు రానున్నారని, ఈ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని భార్యాభర్తల దుర్మరణం



మాధయ్యరెడ్డి, కృష్ణవేణి దంపతులు (ఫైల్)

పోడూరు : వివాహానికి హాజరై ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. పెనుగొండ మండలం కొఠాలపర్రు గ్రామానికి చెందిన ఇసురు మాధయ్యరెడ్డి (50), కృష్ణవేణి దంపతులు ద్విచక్రవాహనంపై పాలకొల్లులో జరిగిన ఓ వివాహానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా జగన్నాథపురం రైస్‌మిల్లు సమీపంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన మాధయ్యరెడ్డిని 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాధయ్యరెడ్డి కుటుంబం కొంతకాలం కిందటే పెనుగొండ మండలం కొఠాలపర్రు గ్రామానికి వలసవచ్చారు. గ్రామంలో పాతప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పైపులు తయారుచేసే కుటీర పరిశ్రమను నడుపుతున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. వీరికి ఇంకా వివాహాలు కాలేదు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో రూ.2.97 లక్షల నగదు సీజ్



కలపర్రు టోల్‌గేట్ వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



జంగారెడ్డిగూడెంలో ఓ వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



గుండుగొలనులో ఓ వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



కొత్తూరు చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టుకున్న పోలీస్ సిబ్బంది, అధికారులు

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలు చోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను జేసీ, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బీ లావణ్యవేణి బుధవారం పరిశీలించారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేటు సమీపంలోని ఎన్నికల చెక్‌పోస్టును తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలు అవుతున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దులతోపాటు పలు ముఖ్య ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదును స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించడం జరుగుతుందన్నారు. నగదు తీసుకువెళ్లే సమయంలో సంబంధిత పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో ఎఫ్ఎస్‌టీ బృందం నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో బుధవారం రూ.91 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి కేపీ రమణ చెప్పారు. పట్టణ పరిధిలోని ఏలూరు రోడ్‌లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో ఎల్.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి రూ.91 వేలు నగదు తీసుకువెళుతుండటాన్ని గుర్తించి ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి ఏలూరు ట్రెజరీ కార్యాలయానికి అందజేసినట్లు చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగబాబు, పవన్‌కుమార్ ఉన్నారు.

గుండుగొలనులో..

భీమడోలు : గుండుగొలను వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.1 లక్ష నగదును స్వాధీనం చేసుకుంది. ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం అధికారి ఎ.మాధవరావు, ఏఎస్సై వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, ఏలూరు నుంచి ఆగడాలలంకకు ఓ కారులో ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష నగదుతో వెళుతున్న సార్నెళ్ల రామకృష్ణ నుంచి నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఉన్నతాధికారులకు అప్పగించారు. తాను చేపల చెరువుల కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు నగదును తీసుకుని వెళుతున్నానని రామకృష్ణ అధికారులు విన్నవించుకున్నారు. అయితే సరైన పత్రాలతో వెళ్లాలని ఎన్నికల అధికారులు సూచించారు.

తగిన ఆధారాలతో నగదు తీసుకువెళ్లాలి

కామవరపుకోట : కామవరపుకోటలో ఎన్నికల చెక్‌పోస్ట్‌లో మండల ఎన్నికల ఎస్ఎస్ అధికారి మహమ్మద్ మోహిద్దీన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఉంగుటూరు మండలం నల్లమాడుకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.06 లక్షల నగదును పట్టివేశారు. తనిఖీల్లో తహసీల్దార్ జేవీఆర్ రమేష్, వీఆర్ఓ బాబురావు, పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, జి.సూర్యారావు, ఎం.నాగార్జున, నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యలు జగన్‌తోనే పరిష్కారం

- ఆటపాకలో కొల్లేరు ఆత్మీయ సమావేశంలో నాయకులు
- భారీగా తరలివచ్చిన లంక గ్రామాల ప్రజలు
- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి కారుమూరి హాజరు



ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళను గజమాలతో సత్కరిస్తున్న కొల్లేరు పెద్దలు

కైకలూరు: కొల్లేరు సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ ఆధ్వర్యంలో ఆటపాక గ్రామంలో కొల్లేరు ప్రజల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. లంకగ్రామాల నుంచి వేలాది మంది జనం తరలివచ్చారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు తన ఆస్తి అంతా పోగొట్టుకున్నానన్నారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కామినేని శ్రీనివాస్ తనకు ఇవే చివరి ఎన్నికలు అంటూ గత ఎన్నికల్లో చెప్పి, మళ్లీ పోటీకి వచ్చారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి నాకు ఎమ్మెల్సీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీని కొల్లేరు లంక గ్రామాల ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మాట్లాడుతూ ప్రజలందరికి అవసరమైన కొల్లేరు పెద్దింట్లమ్మ వారధికి గత పాలకులు శంకుస్థాపన చేస్తే ఈ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. కొల్లేరు గ్రామాల్లో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గత ప్రభుత్వంలో జరిగిన పనులను బేరీజు వేసుకోవాలన్నారు. కొల్లేరు ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. రానున్న రోజుల్లో జయమంగళకు మంత్రి పదవి లభించే అవకాశం ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ కొల్లేరు సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి న్యాయం చేస్తానన్నారు. కొల్లేరు సమస్యలను పూర్తిగా అధ్యయనం చేశానన్నారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి విజయం అందించాలని కోరారు. వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరులో జరిగిన బీసీ గర్జనలో వడ్డీలకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలని కోరితే సీఎం కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. పాదయాత్రలో మాట ఇచ్చిన హామీ ప్రకారం జయమంగళకు ఎమ్మెల్సీ సీటు కేటాయించి గౌరవించారన్నారు. కొల్లేరు ప్రజల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ముంగర నరసింహారావు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, ముంగర మల్లికార్జునరావు, కురేళ్ళ ప్రసాద్‌బాబు, జయమంగళ కాసులు, సైదు కామేష్, సయ్యపురాజు గుర్రాజు, కొల్లేరు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో కార్పెంటరీ దుకాణంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దిప్పకాయలపాడు గ్రామంలో కార్పెంటరీ వర్క్స్ చేసే ఒక దుకాణానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని తమకు అందిన సమాచారం మేరకు గత నెల 20వ తేదీన విద్యుత్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది దుకాణంపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు నిర్ధారించారు. దీనిపై దుకాణం యజమాని ఉప్పటి సోమరాజుపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి, రూ.68,155 అపరాధ రుసుము, రూ.7 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఇటువంటి విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.